ఎన్‌హెచ్‌కు భూసేకరణ వేగవంతం చేయాలి

సీఎస్ రామకృష్ణారావు




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ రామకృష్ణారావు, పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నాగపూర్ నుంచి విజయవాడ వరకు నిర్మించనున్న నేషనల్ హైవే కారిడార్ నిర్మాణంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎస్ రామకృష్ణారావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. నాగపూర్-విజయవాడ, మహదేవపూర్- కాళేశ్వరం రహదారుల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ప్రజా రవాణా, ఆర్థికాభివృద్ధికి జాతీయ రహదారులు కీలకమన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు కరపత్రాల కలకలం



వెలసిన కరపత్రాలు

వెంకటాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రాపురం, టేకులబోరు గ్రామాల శివారులో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరువైపులా మావోయిస్టు కేంద్ర కమిటీ పేరున శనివారం కరపత్రాలు వెలిశాయి. సీపీఐ మావోయిస్టు 21వ స్థాపన వారోత్సవాలను ఈనెల 21నుంచి 27 వరకు దేశ వ్యాప్తంగా విప్లవస్ఫూర్తితో నిర్వహించాలని, పార్టీ పీఎల్‌ఏను, ఐక్య సంఘటనను, విప్లవ ఉద్యమాన్ని కాపాడుకుందామని, విప్లవ ప్రతిఘాతక కగార్ యుద్ధాన్ని విఫలం చేసేందుకు విశాల ప్రజారాశులను వర్గపోరాటంలో గెరిల్లా యుద్ధంలో సమీకరిద్దామని, శత్రువుకు అబేధ్యంగా పార్టీని తీర్చిదిద్దామన్నారు.

సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్


ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): సింగరేణి కార్మికులకు ఆ సంస్థ దసరా అడ్వాన్స్‌ను ఖరారు చేసింది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాలకు ఉత్తర్వులు జారీ చేసింది. పర్మనెంట్ కార్మికులకు రూ.25వేలు, కాం ట్రాక్టు కార్మికులు (బదలీ వర్కర్లకు) రూ.12,500 ఖరారు చేసింది. ఈ నగదు ను ఈ నెల 23న వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొంది. అడ్వాన్స్‌ను కార్మికుల జీతం నుంచి 12 నెలలపాటు రికవరీ చేయనున్నారు.

పూల జాతరకు వేళాయే..



- నేటి నుంచి బతుకమ్మ ప్రారంభం
- ఆటపాటలతో హోరెత్తనున్న ఊరూవాడా
- సిద్ధమవుతున్న మహిళామణులు
- స్థలాలను చదును చేసిన అధికారులు



భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పూల జాతరకు వేళ అయ్యింది. మహిళలు బతుకమ్మ ఆడేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం నుంచి ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభించనున్నారు. తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో ఊరూవాడా హోరెత్తనుంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మార్కెట్లన్నీ శనివారం కిటకిటలాడాయి. బతుకమ్మల కోసం మహిళలు పూలను కొనుగోలు చేస్తూ కనిపించారు. ఈ వేడుకలు జరుపుకునేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

ఆడపడుచుల పర్వదినం

బతుకమ్మ అంటే తెలంగాణ ఆడబిడ్డలకు ఓ పెద్ద పండుగ. ఈ పర్వదినాన్ని ఎంతో గొప్పగా జరుపుకుంటారు. ఈనెల 21 నుంచి ప్రారంభమై 29న సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. ఆ తర్వాత దసరా పండుగ వెను జరుపుకోవడం ఆనవాయితీ. బతుకమ్మ సందర్భంగా తొమ్మిది రోజులపాటు రకరకాల పిండివంటలు చేసి, తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడతారు. బతుకమ్మను ఆడపడుచులు ఒక దైవంలా కొలుస్తారు.

పూలకు భలే గిరాకీ

బతుకమ్మ పండుగ సందర్భంగా పూలకు భలే గిరాకీ ఉంటుంది. ఈ తొమ్మిది రోజులు మహిళలు పూలను కొనుగోలు చేస్తారు. భూపాలపల్లి పట్టణ ప్రాంతం కావడంతో వివిధ గ్రామాల నుంచి చిరు వ్యాపారులు ఇక్కడికి వచ్చి పూలను విక్రయించి ఉపాధి పొందుతారు. భూపాలపల్లిలో సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, జెన్‌కో ఉద్యోగులు, ఇతర స్థానికులు పెద్ద సంఖ్యలో ఈ పూలను కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది బంతిపూల ధర కిలో రూ.50 పలికింది. గునుగు పూలు ఒక చిన్న కట్టకు రూ.10 నుంచి రూ.20 ఉంది. చామంతి పావుకిలోకు రూ.100 పలికింది. ఇంకా ఇతర పూలు కూడా విక్రయానికి ఉండగా మహిళలు కొనుగోలు చేశారు.

ఊళ్లకు తరలుతున్న జనం

బతుకమ్మ పండుగ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి అక్టోబరు 3 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. బతుకమ్మ వేడుకల కోసం మహిళల్లో అత్యధికులు పుట్టింటికి వెళ్లడం ఆనవాయితీ. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో తమ పిల్లలతో కలిసి ప్రయాణాలు కట్టారు. సెలవుల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ (మిగతా 8వ పేజీలో)



ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

బతుకమ్మ ఆడేందుకు జిల్లాలోని పంచాయతీలో ఆయా గ్రామాల కార్యదర్శులు స్థలాలను ఎంపిక చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థలాలను చదునుచేయడమే కాకుండా విద్యుద్దీపాలను అమర్చారు. భూపాలపల్లి పట్టణంలో ఇప్పటికే 30 వార్డులలో వివిధ ప్రాంతాలను ఎంపిక చేసిన అధికారులు ఆయా స్థలాలను చదునుచేసి విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. మహిళలకు ఎలాంటి ఆటంకాలు జరగ కుండా పోలీసులు బందోబస్తును నిర్వహించనున్నారు.

మేడారం పనులకు

టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలి

- పూజారుల కోరిక మేరకు ఆలయ విస్తరణ
- ఆదివాసీల సంప్రదాయాలను గౌరవిస్తాం
- సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



ములుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర పనుల కోసం టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేడారం అభివృద్ధి ప్రణాళికపై హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఆయన (మిగతా 8లో..)

23న మేడారానికి సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి రానున్నారు. ఈనెల 23న ఆయన పర్యటించనున్నారు. మేడారం అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేయనున్నారు. అలాగే మేడారం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి డిజైన్లను ఖరారు చేయనున్నారు.

టేకుమట్లలో ఉద్రిక్తత

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య పోరు
- నిరసనలకు ఉపక్రమించిన ఇరు పార్టీలు
- నేతలను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

టేకుమట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య నిరసనల పర్వం కొనసాగింది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో శనివారం ఆందోళన కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు పిలుపునివ్వగా, కౌంటర్‌గా కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు పరిస్థితి చేయిదాటకుండా అప్రమత్తమయ్యారు. కాంగ్రెస్ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. అదే క్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి మొగుళ్లపల్లి స్టేషన్‌కు తరలించారు. ప్రత్యేక బలగాలతో మండల కేంద్రంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మొగుళ్లపల్లి, చిట్యాల ఎస్సైలు రెండు పార్టీలకు సంబంధించిన ముఖ్య నేతలను దశల వారీగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఇదే క్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పోలీసుల కళ్లుగప్పి ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి నిరసనకు దిగారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని ధర్నా నిర్వహించకుండా అడ్డుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



సమావేశంలో డీఎల్ఎఫ్, డీబీఎఫ్ నేతలు

ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉద్యమించాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, డీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

కాటారం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మార్వాడి సుదర్శన్ అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, దళిత, గిరిజన భూ సమస్యలపై చర్చించడానికి డీఎల్ఎఫ్, డీబీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్, సుదర్శన్ మాట్లాడతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చింతకాని గ్రామంలో దళితులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకున్న దాఖలు లేవని విమర్శించారు. ఎస్సీల భూమిని అన్యాక్రాంతం చేయడానికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో దళితులకు పంపిణీ చేసిన భూములకు పట్టాలు మంజూరు చేయాలని, కాటారం సర్వే నంబరు 501లో సాగులో ఉన్న వారికి డిజిటల్ సర్వే పూర్తయిన నేపథ్యంలో పట్టాలివ్వాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలపై కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం, ఎమ్మార్పీఎస్, మానవ హక్కుల వేదిక, నేతకాని సంఘం నాయకులు బాలరాజు, మంత్రి మధు, ఆశయ్య, లచ్చయ్య, రామయ్య, సంజీవ్, జాడి శ్రీశైలం, సమ్మయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



మునిసిపల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెన్షన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ ధర్నా

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మడిపల్లి శ్యాం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఇప్పటికైనా పెన్షన్లు పెంచాలని కోరారు. దివ్యాంగులతకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్రమౌళి, రాజేందర్, కిరణ్, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఏఐటీయూసీ నేతలు



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో సీఎంను శనివారం కలిసి సింగరేణి కార్మికుల సమస్యలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం ఈ సమస్యలపై సింగరేణి యాజమాన్యానికి ఉత్తర్వులు జారీ చేసి దసరా తర్వాత నిర్ణయం తీసుకొనే చర్యలు చేపడతామని అన్నారని కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు.

భూపాలపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుభాష్‌కాలనీ వెళ్లే రహదారిపై టీ బీజీకేఎస్ కార్యాలయం ఎదుట మృతదేహం పడి ఉండగా గమనించిన స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని వంద పడకల ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి గురించి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్సై సాంబమూర్తి కోరారు. ఈ వ్యక్తి కొంతకాలం క్రితం వరంగల్ నుంచి భూపాలపల్లికి వచ్చాడని, తనది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కావలిగా చెప్పేవాడని స్థానికుల ద్వారా తెలిసింది.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన రాజేశం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన భూపాలపల్లి పట్టణ శివారు బొగ్గులవాగు సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామానికి చెందిన మాంత రాజేశం వ్యక్తిగపని నిమిత్తం భూపాలపల్లికి వచ్చి తిరిగి తన ద్విచక్ర వాహనంపై ఆజాంనగర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. ఆ వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. రాజేశం పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది.

పేదలకు అండగా

సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం పలు వురు లబ్ధిదారులకు ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడతూ పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లవేళలా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు ఎడ్ల మల్లారెడ్డి, రేగొండ టౌన్ అధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి నాయకులు నాంసాని రాంబాబు, కిరణ్‌పటేల్, పున్నం రవి, పట్టెం శంకర్, వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఝాన్సీరెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా..

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

పెద్దవంగర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో దర్గుజు స్వరూప, గంట్లకుంటలో ముక్కవుల మల్లమ్మ, కాన్వాయిగూడెంలో తాండాల మంజుల, కర్ర మురళీధర్‌రెడ్డి, మల్లయ్య, ఐలయ్య, తండాల కళ్యాణి, నర్సమ్మ, కొరిపెల్లిలో ఎర్ర వినయ్, ఎర్ర సోమలక్ష్మి గ్రామాలలో ఇటీవల మరణించగా మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, ఇన్‌చార్జి వియ్‌పాల్‌రెడ్డి, రంగు మురళిగౌడ్, గోపాల్, ముత్యాల పూర్ణచందర్, రవీందర్ రెడ్డి, పొడిశెట్టి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప కుటీర నిర్మాణ పనులకు విరాళం

నర్సింహులపేట,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప కుటీర నిర్మాణ పనులకు ఇద్దరు భక్తులు 2.75లక్షల విరాళం చెక్కు రూపంలో అందించారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇందిరా గాంధీ కోఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ ప్రైవేట్ లిమిటెడ్ అధ్యక్షుడు మరియు రాజేంద్రనగర్ అయ్యప్ప స్వామి దేవాలయ కాటేదాన్ ఉపాధ్యక్షుడు సంకూరి జయప్రకాశ్ 2లక్షలు, సీనియర్ పాత్రికేయులు పగిడిమర్రి సూర్యనారాయణ75వేలు మొత్తం 2లక్షల75వేల చెక్కులను స్థానికుడు ఎనగండ్ల క్రిష్ణారెడ్డి సమక్షంలో భక్త మండలికి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులడు జినుకల రమేష్, మాజీ దేవాలయ చైర్మన్ బొల్లం రమేష్, బొల్లం మోహన్‌రావు, ఎనగండ్ల జెన్నయ్య, మొగలగాని యాదగిరి, ఎరనాగి రమేష్, కల్లెడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

పాఠశాలల్లో ఆడిపాడిన విద్యార్థులు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మండలంలోని హరిపిరాల, చెర్లపాలెం తదితర పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూవ్వులు పేర్చి ఘనంగా బతుకమ్మ పాటలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు తనూజ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వమని మన ఆచార, సంప్రదాయంతో ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు ఆడుకునే పూల పండగ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు యాకూబ్‌అలీ, జయపాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మల్లయ్య, రాధ, పద్మావతి, రాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.

● చిన్నగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ నెల 21నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్కచోట చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

● మరిపెడ(ఆంధ్రజ్యోతి) : ముందస్తు బతుకమ్మ వేడుకలు మరిపెడ మున్సిపాలిటీలోని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్, మరిపెడ హైస్కూల్, బంగ్లాలోని సీతారాంపూర్ పాఠశాలలో నిర్వహించారు. ఆయా పాఠశాలల టీచర్లు, విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. మరిపెడబంగ్లాలోని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు బతుకమ్మను వేడుకలు నిర్వహించి, అనంతరం స్థానిక కొండసముద్రం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వేడుకలో డైరెక్టర్లు జర్పుల కాలునాయక్, అఫ్జల్, బెన్నిథామస్, జోసెఫ్, సురేశ్, సనూప్, సుభాన్, రామరావు, అఫ్సర్, హరిత, వర్షిత, శ్రీలక్ష్మి, ఉమ, మరిపెడ స్కూల్లో హెచ్‌ఎం అనంతరావు, టీచర్లు, బంగ్లా సీతారాంపూర్ పీఎస్ స్కూల్ హెచ్‌ఎం అర్జున్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మలను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్తున్న మరిపెడలోని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు

'స్వస్థ్ నారీ సశక్త్' తో మహిళలకు మెరుగైన వైద్యం

డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ్ నారీ -సశక్తి పథకంతో మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తొర్రూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మరిపెడ పీహెచ్‌సీ లోస్వస్థ్ నారీ -సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా మండలంలోని పలువురి మహిళలకు స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పార్వతి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మరిపెడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవినాయక్, డాక్టర్లు సౌజన్య, వెంకన్న, పూజిత, సీహెచ్‌వో కమల, పీహెచ్‌ఎన్‌వో మంగమ్మ, సూపర్‌వైజర్లు కృష్ణ, ఆచార్యులు, సుదర్శన్, లక్ష్మీ కుమారి, మాధవి, స్టాఫ్‌నర్స్ సుజాత, రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మరిపెడలో మహిళలకు వైద్య పరీక్షలు జరుపుతున్న డాక్టర్ పార్వతి

● దంతాలపల్లి (ఆంధ్రజ్యోతి)ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ -సశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి కవిత మాట్లాడుతూ స్త్రీ వైద్యనిపుణురాలు కీర్తి ఆధ్వర్యంలో 57 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంజీవరావు, హెల్త్‌సూపర్‌వైజర్లు మంగమ్మ, సుజాత, భీమానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

● తొర్రూరు (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ఆయుర్వేద సీనియర్ వైద్యుడు డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన కల్పించారు. ఈనెల 23న దేశ వ్యాప్తంగా ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ఆయుర్వేదంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు రామలక్ష్మి, అయేష తదితరులు పాల్గొన్నారు.

కూపన్ల పంపిణీలో సొమ్మసిల్లిన జీపీ కార్యదర్శి

పోలీసుల వాహనంలో ఆసుపత్రికి తరలింపు

దంతాలపల్లి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కూపన్ల పంపిణీ చేస్తున్న రైతు వేదిక భవనంలో ఓ పంచాయతీ కార్యదర్శి సొమ్మసిల్లి నేలపై పడిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద శనివారం జరిగింది. తెల్లవారు జామునే రైతులు యూరియా కోసం బారులు తీయడంతో అధికారుల సమక్షంలో కూపన్లు పంపిణీ చేస్తున్నారు. ఏఈవోలు దీక్షిత్‌కుమార్, శిరీష పంచాయతీ కార్యదర్శి తాళ్ల అజయ్‌లు ఆర్డర్ ప్రకారం రైతు వేదిక భవనంలో కూపన్లు ఇస్తున్నారు. రైతుల తాకిడి విపరీతంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శి అజయ్ తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లిపడిపోయాడు. వెంటనే స్థానిక పోలీసులు వారి వాహనంలో ఆయనను చికిత్స కోసం తొర్రూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వ్యవసాయాధికారి వాహిని తెలిపారు. రైతులు తమకు సహకరించాలని గుంపులు గుంపులుగా రావడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిన్నగూడూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. ఉగ్గంపల్లికి చెందిన ముత్యం దివ్యకు మంజూరైన రూ. 33వేల సీఎం సహాయనిధి చెక్కును శనివారం లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అంద జేశారు.

నాన్ టీచింగ్ ఉపాధ్యాయుల

సమస్యలు పరిష్కరించాలి

పెద్దవంగర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శనివారం మండలంలోని చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలలో ఈనెల 22న స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్‌టీచింగ్ ఉపాధ్యాయులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని వారికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని నాన్ టీచింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీయూసీఐ తొర్రూరు అధ్యక్షుడు ఎండీ షరీఫ్, నాయకులు విజయలక్ష్మి, మమత, పద్మ, మహేశ్వరి, హేమలత, మౌనిక, జ్యోతి, సూజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తొర్రూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాల నిర్వహణలో భాగంగా శనివారం తొర్రూరు బస్టాండ్ ఆవరణలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మోదీ 75 జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 12కోట్ల మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం జరిగిందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పల్లె కుమార్, సురేష్, నవీన్, విశాల్, యాకయ్య, రాంబాబు, రవిబాబు, తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



పాలకుర్తిలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నాయకులు

పాలకుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల కోసం రూ.10వేల కోట్లతో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డుకు రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. అలాగే ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, ఉచిత బస్సు, రైలు ప్రయాణం, హెల్త్‌కార్డులు, సంక్షేమ పథకాలలో 20శాతం కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నందగిరి రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నలమాస రమేష్, సంగి వెంకన్న, అనుముల అంజీరావు ఉన్నారు.

● జనగామ రూరల్(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల చైతన్య బస్ యాత్రను చేపట్టగా శనివారం జనగామకు చేరుకుంది. అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉద్యమకారులు నిరసన చేపట్టారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారుల కమిటీని వేసి గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, ప్రతీ ఒక్క ఉద్యమకారుడికి 250 గజాల స్థలం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు, ట్రైన్ పాస్, ఆరోగ్య కార్డులు సంక్షేమ పథకంలో 20శాతం కోటా కేటాయించాలని కోరారు. అక్టోబరు 26 చలో ఇందిరాపార్కును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, కొముత్తం వీరస్వామి, రాజు పాల్గొన్నారు.

రామప్పలో విదేశీయుల సందడి



గైడ్ ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న విదేశీయులు

వెంకటాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని విదేశీయులు శనివారం సందర్శించారు. హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ఇరాక్, పాలస్తీనా, ఆర్మేనియా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, శ్రీలంక, వియత్నాం, థాయ్‌లాండ్, ఈజిప్ట్, దక్షిణ సూడాన్, జిబౌటి, ఉగాండా, టాంజానియా, కెన్యా, కోట్‌డి ఐవోయిర్, గాంబియా, లైబీరియా, ఘనా, మొజాంబిక్, జాంబియా, నమీబియా, మారిషస్, క్యూబా, డొమినికన్ రిపబ్లిక్, సురినామ్ తదితర 25 దేశాలకు చెందిన వారు దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ శిల్ప కళా సంపదను పరీక్షించిన విదేశీయులు విశిష్టత, చరిత్రను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. వారివెంట పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, టూరిజం, పురావస్తుశాఖల సిబ్బంది ఉన్నారు.

వేధింపుల కేసులో యువకుడి రిమాండ్

కొడకండ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వివాహితను లైంగికంగా వేధిస్తున్న యువకుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. జనగామ జిల్లా కొడకండ్ల ఎస్ఐ చింత రాజు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొడకండ్ల మండలం పాకాలకు చెందిన యువకుడు రాచకొండ కుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు సంతానం. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను కొద్దిరోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. అతడి వేధింపులు భరించలేక ఈనెల 13న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి కుమార్ పోలీసులను తప్పించుకు తిరుగుతున్నాడు. ఇటీవల మళ్లీ సదరు యువతిని వేధించడంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ దీంతో శనివారం పోలీసులు కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మేడారంలో భూసేకరణపై సమావేశం

● స్థానిక గిరిజన రైతులతో ఆర్డీవో చర్చలు



సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేశం

తాడ్వాయి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మల దేవస్థానం అభివృద్ధికి 19.20 ఎకరాల భూసేకరణ కోసం ఆర్డీవో వెంకటేశం ఐటీడీఏ అతిథి గృహంలో స్థానిక రైతులతో శనివారం సమావేశమయ్యారు. భూసేకరణపై వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసియా ఖండంలో పెద్దది అయిన గిరిజన జాతరగా పేరొందిన మేడారం దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎవైనా డిమాండ్లు ఉంటే తెలపాలని, వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. రైతులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ. 20 లక్షలతోపాటు జీవనోపాధికి భూమికి రోడ్డు వెంబడి షాప్ కట్టించి ఇస్తామని అన్నారు. దీంతో కొందరు రైతులు రూ. కోటి చెల్లించాలని కోరారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ అంత మొత్తం ఇవ్వడం కుదరదని, రైతులు సమావేశమై దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తాడ్వాయి ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌బాబు, ఆర్ఐ రాజు. రెవెన్యూ సిబ్బంది, మాజీ సర్పంచ్ చిడం బాబురావు, మేడారం జాతర పంటనష్ట పరిహార సాధన సమితి అధ్యక్షుడు కృష్ణార్జున్ తదిరులు పాల్గొన్నారు.

కొనసాగిన ట్రక్ డ్రైవర్ల సమ్మె



విధులను బహిష్కరించిన ట్రక్ డ్రైవర్లు

గణపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్టు-3లో వోల్వో ట్రక్ డ్రైవర్లు రెండో రోజు కూడా విధులను బహిష్కరించారు. తమకు వేతనాలు సరైన సమయంలో ఇవ్వడం లేదని శుక్రవారం ఉదయం సమ్మెకు దిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టు సంస్థ శనివారం సాయంత్రం వేతనాలను చెల్లించింది. అయితే.. సమస్యలు పరిష్కరించేంత వరకు తాము విధులకు హాజరు అయ్యేది లేదని డ్రైవర్లు తేల్చిచెప్పారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని 163వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. రాంపూర్ గ్రామానికి చెందిన రైతు సర్వేశ్వరరావు మిర్చి పంటకు నీళ్లు పెట్టి తిరిగి వస్తుండగా ముల్లేకట్ట గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో సర్వేశ్వరరావు కుడి కాలు పూర్తిగా విరిగిపోగా అతడిని వరంగల్‌కు తరలించారు.

విద్యుత్ తీగలు అమర్చిన కేసులో

ఆరుగురి రిమాండ్

మహదేవపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అడవి ప్రాంతం లో విద్యుత్ అమర్చిన కేసులో మండలంలోని మద్దులపల్లి గ్రా మానికి చెందిన ఆరుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రి మాండ్‌కు తరలించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన చకినారపు సంతోష్, వేల్పుల నాగరాజు, కోరళ్ల శేఖర్, వేల్పుల సురేష్, సకినారపు శ్రీని వాస్, చకినారపు బాపు కొద్ది సంవత్సరాలుగా అడవిలో విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని విక్రయించే వారు. ఈ క్రమంలో గత సంవత్సరం బల్దాపూర్ శివారు అడవి లో మంచిర్యాల జిల్లా కోటపల్లి గ్రామానికి దుర్గం ప్రవీణ్ అనే వ్యక్తి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. ఈ ఆరుగు రు విద్యుత్ తీగలు అమర్చడమే ప్రవీణ్ మృతికి కారణమైందని గుర్తిం చిన పోలీసులు వారిని అరెస్టు చేశారు. విలేకరుల సమావే శం లో సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్సై తమాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు

లోకాయుక్తను ఆశ్రయించిన మహిళారైతు

బచ్చన్నపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 14 ఏళ్లుగా తాను పట్టాలో ఉండీ కబ్జాలో కొనసాగుతున్న భూమిని ఎలాంటి విచారణ జరపకుండా రెవెన్యూ అధికారులు ఇతరులకు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చి తమకు అన్యాయం చేశారని జనగామ జిల్లా బచచన్నపేట మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు గుర్రాల లలిత నర్సిరెడ్డి లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. శనివారం ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. రెవెన్యూ అధికారులు తప్పుడు మార్గాల్లో వెళ్తున్నారని, తమ భూమిపై ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.



ఫిర్యాదు పత్రంతో లలిత



వేయిస్తంభాల గుడి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల ఆలయం వద్ద నిర్వహించే రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకల ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లు, మునిసిపల్, పోలీసు, విద్యుత్, ఇతరశాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసి ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. బతుకమ్మ ఉత్సవంలో పాల్గొనేందుకు మహిళలు అధికసంఖ్యలో పాల్గొననున్నందున మహిళా పోలీసులు ఎక్కువ సంఖ్యలో బందోబస్తులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ షేక్ సలీమా, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఏసీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పండుగకు పూలు కరువు

- కనిపించని తంగేడు, గునుగు పూల చెట్లు
- రసాయనిక మందులు, యంత్రాల వాడకమే కారణం
- మాయమైపోతున్న కంచెలు, బీడు భూములు
- బతుకమ్మ పండుగకు అతివల తిప్పలు
- రోడ్లపై కొనుగోలు చేస్తున్న వైనం
- రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు



తంగేడు పువ్వు



గునుగు పువ్వు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పూజించే సంస్కృతి దేశ వ్యాప్తంగా కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంటుంది. దానికి నిదర్శనమే బతుకమ్మ పండుగ. ప్రకృతి ప్రసాదించిన పూలను ఎంతో అలంకార ప్రాయంగా పేర్చి, కూర్చి, అందులో పసుపు ముద్దను పెట్టి గౌరమ్మగా భావిస్తారు. వాటికి పూజలు చేయడంతో పాటు మహిళలంతా ఒక్కచోటచేరి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. ఇలాంటి సంస్కృతి దేశంలో మరెక్కడా కనిపించదు. అందుకే బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర పండుగగా కీర్తించబడుతోంది. కానీ, అదే ప్రకృతి పండుగకు పూలు కరువవడం ఒకింత బాధపడాల్సిందే.

కనిపించని తంగేడు, గునుగు..

బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. ప్రధానంగా తంగేడు, గునుగు పూలు లేనిది మహిళలు బతుకమ్మను పేర్చరు. ఎంత దూరమైనా, ఎంత ఖర్చయినా సరే తంగేడు, గునుగు పూలు పెట్టి బతుకమ్మను చేయాల్సిందే. ఆ పూలు ఉంటేనే బతుకమ్మకు అలంకారమనేది మహిళల ప్రగాఢ నమ్మకం. అలాంటి పూలు ఇప్పుడు గ్రామాల్లో కనిపించడం లేదు. గతంలో ఎక్కడ పడితే అక్కడ తంగేడు పూలు కనిపించేవి. పంట చేలల్లో, పొలం గట్ల వెంట గునుగు పూల చెట్లు నిగనిగ మెరిసేవి. కానీ, పూలను చూద్దామంటే కూడా కనిపించక పోవడంతో ఇక బతుకమ్మ పండుగకు పూల కరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

రసాయనిక మందులు, యంత్రాల వాడకమే..

గతంలో వ్యవసాయాన్ని ఎక్కువగా సేంద్రీయ పద్ధతిలో చేసేవారు. దీనికి తోడు భూమిని దున్నాలంటే నాగళ్లతో పశువుల సహాయంతో దున్నేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి గ్రామాల్లో ఎక్కడా కనిపించడం లేదు. సేంద్రీయ వ్యవసాయం పక్కన పెట్టి ఇష్టానుసారంగా రసాయన మందుల వాడడంతో ప్రకృతి సిద్ధంగా పెరిగే తంగేడు, గునుగు పూల మొక్కలు కనిపించడం లేదు. దీనికి తోడు ఎక్కువగా గడ్డి మందును వాడడం సైతం ఈ మొక్కల పెరుగుదలకు ఆటంకం కలుగుతోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. పొలంలో, పొలం గట్ల వెంట, చేనుల్లో పెరిగే కొన్ని మొక్కలు సైతం యంత్రాల సహాయంతో దున్నడంతో భూమిలో కలిపోతున్నాయి. తద్వారా తంగేడు, గునుగు పూల చెట్లు కనుమరుగవుతున్నాయి.

రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు..

తంగేడు, గునుగు పూలు లభించక పోవడంతో కొంత మంది వీటిని రోడ్లపైకి తీసుకువచ్చి ప్రజలకు అమ్మకాలు జరుపుతున్నారు. వీటికి తోడు గునుగు పూలకు ఏకంగా రంగులద్ది అమ్ముతున్నారు. కట్టలుగా కట్టి తంగేడు, గునుగుతో పాటు బంతి, చామంతి, మందార లాంటి ఇతర పూలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం బంతి పూలు కిలో రూ.150 ఉండగా, చామంతి పూలు రూ.400 వరకు పలుకుతున్నాయి. వీటికి తోడు తంగేడు కట్ట రూ.50 కాగా, గునుగు పూల కట్టకు రంగులద్ది ఇస్తే రూ.100 వరకు తీసుకుంటున్నారు.

మాయమైపోతున్న కంచెలు..

ఒకప్పుడు ప్రతి గ్రామంలోసైతం ఊరి చివరన కంచెలు ఉండేవి. వాటికి తోడు బీడు భూములు సైతం కనిపించేవి. వాటిల్లో తంగేడు, గునుగు పూల చెట్లు ఎక్కువగా పెరిగేవి. దాదాపు ఊరంతటికి సరిపోయేంత పూలు లభించేవి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జనాభా పెరుగుతుండడంతో కొద్ది భూములు సైతం సాగులోకి వచ్చేస్తున్నాయి. కంచెలు, బీడు భూములు ఏమున్నా మనిషి ఆధునిక పరికరాలతో సాగులోకి తెచ్చేస్తున్నాడు. తద్వారా పూల మొక్కలు కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం రోడ్లు, చెరువులు, కుంటల వెంట కొన్ని తంగేడు చెట్లు పెరగడంతో కొంతమందికి మాత్రమే పూలు లభిస్తున్నాయి. వాటిని కూడా కొందరు తెంపుకుని నగరాలకు తరలించి అమ్మేసుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత వాసులు కూడా రోడ్లపైకి వచ్చి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.

కాంట్రాక్టు ఉద్యోగి దుర్మరణం

- విద్యుత్ అధికారులపై కేసు

కరీమాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యం వహించి ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందడానికి కారణమైన విద్యుత్ అధికారులపై మిల్స్ కాలనీ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం ఏకే తండాకు చెందిన మూడు సంధ్య కుమారుడు మూడు వినోద్‌తో పాటు తన స్నేహితులైన బానోత్ దేవేందర్, మునావత్ సంతోష్, భూక్య స్వామి బొంపెల్లి సంపత్‌రావు అనే కాంట్రాక్టర్ దగ్గర రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. పనుల్లో భాగంగా ఈ నెల 19వ తేదీన ఉర్సు ప్రాంతంలో మధ్యాహ్నం 12గంటలకు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసే సమయంలో స్థానిక లైన్‌మెన్ కోడం సాంబయ్యను ఎల్‌సీ కోరారు. సాంబయ్య ఎల్‌సీ క్లియర్ కన్‌ఫర్మ్ అని బానోత్ దేవేందర్‌తో చెప్పాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు పనిని ప్రారంభిస్తుండగా విద్యుత్ సరఫరా అవడంతో మూడు వినోద్‌తో పాటు, భూక్యా స్వామి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే వారిని దగ్గర్లో ఉన్న మెడికేర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మూడ్ వినోద్(35) అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రాణాపాయ స్థితిలోఉన్న స్వామిని మరో ఆసుపత్రికి తరలించారు. కాగా ఎల్‌సీ క్లియర్ అంటూ తప్పుడు సమాచారం ఇచ్చిన లైన్‌మెన్ కొడం సాంబయ్యతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏడీ పి.చంద్రమౌళి, ఏఈ దేవరాయ సంపత్, లైన్‌ఇన్‌స్పెక్టర్ భద్రయ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడు వినోద్ తల్లి సంధ్య మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేశారు.

ఓ-పాజిటివ్‌కు బదులు బి-పాజిటివ్..

- రక్తం ఎక్కించడంలో వైద్య సిబ్బంది తప్పిదం
- రోగి పరిస్థితి విషమం.. ఎంజీఎంలో కలకలం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రోగులపై మరోసారి నిర్లక్ష్యం బయటపడింది. ఒక గ్రూపు రక్తం బదులు మరో గ్రూప్ రక్తాన్ని రోగికి ఎక్కించారు. రోగి ఆరోగ్యం విషమంగా మారడంతో గుట్టుచప్పుడు కాకుండా రోగికి చికిత్స అందిస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలోని ఫీమేల్ మెడికల్ వార్డులో జ్యోతి అనే రోగికి ఓ-పాజిటివ్ బ్లడ్‌కు బదులుగా బి-పాజిటివ్ బ్లడ్ ఎక్కించారు. రోగి వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సీనియర్ వైద్యులు రంగంలోకి దిగి ఎందుకు ఇలా జరిగిందని ఆరా తీయగా.. మరో బ్లడ్ గ్రూప్ రక్తం ఎక్కించారని వెల్లడైంది. వెంటనే వైద్యులు గుట్టుచప్పుడు కాకుండా చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం జ్యోతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రోగి బంధువులు వైద్యులపై మండిపడుతున్నారు.

విచారణకు ఆదేశం

ఎంజీఎం ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌పై విచారణకు ఆదేశించినట్లు ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి తెలిపారు. రక్తం గ్రూప్ మారడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. రోగి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. విచారణ కమిటీ నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

'దసరా ఉత్సవం'పై ముదురుతున్న వివాదం

- డోలాయమానంలో కాశిబుగ్గ సమితి
- ఎక్కడ, ఎలా నిర్వహించాలనే విషయమై మల్లగుల్లాలు
- ఉత్సవాలను తామే నిర్వహిస్తామంటున్న 14వ డివిజన్ నాయకులు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ప్రోత్సాహంతో ముందుకు...



ఏనుమాముల మార్కెట్‌లో సమావేశమైన అన్ని పార్టీల నాయకులు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల పాటు వైభవంగా దసరా ఉత్సవాలను నిర్వహించిన కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకుల పరిస్థితి ప్రస్తుతం 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అన్న చందంగా తయారైంది. 'కాశిబుగ్గ దసరాతో కొత్త చిక్కు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంతో శనివారం వారు అత్యవసరంగా సమావేశమయ్యారు. 14వ డివిజన్‌కు చెందిన అన్నిపార్టీల నాయకులు 'మా డివిజన్‌లో మేమే దసరా ఉత్సవాలను నిర్వహించుకుంటాం' అంటూ తీర్మానం చేసుకున్నారు. దీంతో కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి ఏం చేయాలో తెలియని స్థితిలో పడిపోయింది. వారు కూడా వెంటనే సమావేశమై పరిస్థితిని సమీక్షించుకున్నారు. ఇప్పటికే చందాల విషయంలో అనేక ఆరోపణలు రావడం, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఈ విషయంలో మందలించడంతో ఉత్సవాలు నిర్వహిద్దామా.. వద్దా.. అని చర్చించారు. చివరికి కొన్ని ప్రతిపాదనలతో ముందుకు సాగాలని తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది.

14వ డివిజన్‌కు చెందిన నాయకులతో మాట్లాడి ఉమ్మడిగా ఉత్సవాలను నిర్వహించుకునేలా ఒప్పించాలని, ఉత్సవాలు జరిగే స్థలం 14వ డివిజన్ కాదు, 20వ డివిజన్ కిందకే వస్తుందని చెప్పాలని, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు, కొండా సురేఖ, మురళీధర్‌రావులను కలిసి ఉత్సవాలు నిర్వహించుకునేలా సహకరించాలని కోరాలని, గతంలో మాదిరిగా 'కుడా' పర్మిషన్ తీసుకుని ఓసిటీ స్టేడియంలో ఉత్సవాలు నిర్వహించాలని, లేదంటే దసరా ఉత్సవాలను 14వ డివిజన్ వారికి అప్పజెప్పాలని.. ఇలా అనేక అంశాలపై చర్చించినట్టు తెలిసింది. అలాగే దసరా పరపతి సంఘం సమావేశం ఏర్పాటుచేసి డబ్బుల లెక్కలు తీసి క్లియర్ చేయాలనే అంశంపైనా చర్చించినట్టు సమాచారం.

మా ఏరియాలో మీ పెత్తనమేంటి?

"మా నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటి?" అంటూ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకుడికి శనివారం వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఫోన్‌చేసి మందలించినట్లు తెలిసింది. మీ పరిధిలో మీరుండాలని, అంతకుమించి పోవద్దని సూచించినట్లు తెలిసింది. మరోవైపు 14వడివిజన్ నాయకులతో మాట్లాడి కొత్తగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో అన్ని పార్టీల నాయకులతో ఉత్సవాలను నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది.

ఉత్సవాలను మేమే నిర్వహించుకుంటాం..

'దసరాతో కొత్త చిక్కు' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంతో 14వ డివిజన్ నాయకులు ఆలోచనలో పడ్డారు. వెంటనే అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య అధ్యక్షత వహించారు. "మన డివిజన్ పరిధిలో జరుగుతున్న ఉత్సవాలకు మనల్ని ఆహ్వానించకుండా, మన ప్రమేయం లేకుండానే కాశిబుగ్గ దసరా కమిటీ ఉత్సవాలు నిర్వహించడం సరికాదు..' అంటూ ఖండించారు. ఏర్పాట్లన్నీ ప్రభుత్వ శాఖలే నిర్వహిస్తుండగా ఒక బొమ్మ మాత్రమే దసరా ఉత్సవ సమితి వాళ్లు ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని, వాటిని మనమే ఘనంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు శాసనసభ్యుడు నాగరాజును కలిసి ఏర్పాట్లు చేయించాలని కోరాలని నిర్ణయించారు.



అత్యవసర సమావేశంలో పాల్గొన్న కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు

అన్నంత పని చేశాడు..

- మరణాన్ని కావాలనే ఆహ్వానించాడు..
- సురేందర్ ఆత్మహత్యతో రాంనగర్‌లో విషాదం
- స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబసభ్యులు



సురేందర్(ఫైల్)

ఐనవోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా మానసిక వ్యథతో బాధపడుతూ అన్నంత పనిచేశాడు.. చావాలనిపిస్తోందని తనువు చాలించాడు. బీటీ నగర్‌లో ఆత్మహత్య చేసుకున్న బ్యాంక్ ఉద్యోగి ఉదంతం స్వస్థలం రాంగనర్‌లో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఐనవోలు మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన బర్ల సోమయ్య - ఐలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సురేందర్, నాగరాజు, కూతురు లత ఉన్నారు. తండ్రి గతంలోనే చనిపోయాడు. బీద కుటుంబమైనప్పటికీ ఇద్దరు కుమారులు కష్టపడి ఉన్నత చదువులు చదివి బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. బర్ల సురేందర్(36) ఎంటెక్ విద్యను అభ్యసించాడు. కొన్నేళ్లుగా హెచ్‌డీఎఫ్‌సీలాంటి బ్యాంకుల్లో ఉద్యోగం చేశాడు. నెల కిందట నుంచి ఐసీఐసీఐ హైదరాబాద్ హైటెక్ సిటీ మాదాపూర్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రామంతాపూర్‌లో నివాసముంటున్న అతడికి భార్య సంధ్యరాణి, కుమారుడు సాకేత్ ఉన్నారు. అతడు శుక్రవారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి బీటీనగర్ చెరువు కట్టపైకి వెళ్లాడు. తనను చావు పిలుస్తోందని కుటుంబసభ్యులకు వాట్సాప్ మేసేజ్ చేసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం మృతదేహాన్ని గుర్తించి వెలికితీసి స్వగ్రామానికి తీసుకవచ్చి అంత్రక్రియలు నిర్వహించారు. అయితే అతడి మరణం అందరినీ ఆందోళనకు గురిచేసింది. తనకు మరణం తప్పదని కొంతకాలంగా కుటుంబసభ్యులు, బంధుమిత్రుల దృష్టికి తీసుకవచ్చినప్పటికీ ఆత్మహత్య వేదన అతడి మనుసును వీడలేదు.

మానసిక వైద్యుడిని సంప్రదిస్తే బతికేవాడు..

సురేందర్ కొన్ని రోజులుగా చావాలనిపిస్తోందని కుటుంబసభ్యులకు చెబితే అతడికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఉద్యోగంలో ఏమైనా ఇబ్బంది ఉందా?, ఆర్థిక సమస్యలు, కుటుంబసమస్యలు ఏమైనా ఇబ్బందిపెడుతున్నాయా? అని కుటుంసభ్యులు అడిగి తెలుసుకున్నారు. తనకు కుటుంబం, ఆర్థిక సమస్యలు లేవని చెప్పుతూనే కొత్త ఉద్యోగం చేయలేకపోతున్నానని ఒక మాట చెప్పాడట. ఉద్యోగం మానేసి పాత ఉద్యోగం చేయమని సలహాలు ఇచ్చారు తప్ప.. చనిపోయే ఆలోచన ఎందుకు వస్తోందని మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లలేదు. మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకెళితే చావు తప్పేదని అతడి అంత్రక్రియల్లో పాల్గొన్న స్థానికులు, విద్యావంతులు విచారం వ్యక్తం చేశారు.

దామెర చెరువు అభివృద్ధికి చర్యలు

- అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు
- నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్

కరీమాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ మండలంలోని జక్కలొద్ది సమీపంలో ఉన్న దామెర చెరువు పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్ తెలిపారు. 'దామెర చెరువుపై నిర్లక్ష్యమేల?' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. పని చేయని తూములు, కుంగిన కట్ట, రెండు వైపులా పెరిగిన చెట్లు, నీటి పారకం కాల్వల దుస్థితి.. ఇలా చెరువు వద్ద నెలకొన్న దుస్థితిని కథనం కళ్లకు కట్టింది. ఈ నేపథ్యంలో ఈఈ కిరణ్‌కుమార్, డీఈ మధుసూదన్‌రెడ్డి శనివారం చెరువును సందర్శించారు. స్థానిక రైతు ప్రతినిధులతో కలిసి దాదాపు రెండు గంటలపాటు చెరువు సమస్యలను పరిశీలించారు. పాడైపోయిన రెండు తూములను స్వయంగా చూశారు. పలుచోట్ల కోతకు గురై కుంగిన కట్టను పరిశీలించారు. కట్టపైన పెద్దఎత్తున మొలిచిన చెట్లు, పొదలను తిలకించారు. రైతులతో కలిసి కట్టపైన అతికష్టమ్మీద నడిచారు. చెరువు వద్దకు వెళ్లే దారి బురదమయం కాగా, మసీదు బండ నుంచి కట్ట వరకు స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులు చెరువు సమస్యలను ఏకరువు పెట్టారు. ఇరిగేషన్ అధికారులు గత పదేళ్లుగా చెరువు నిర్వహణను పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తూములు తెరుచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇప్పటికే చెరువు నిండు కుండలా మారిందని, ఇంకా వర్షాలు పడుతున్నందున కట్టకు గండి పడితే రైతులకు, నగరవాసులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. వెంటనే మరమ్మతులతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

రైతుల గోడును సావధానంగా విన్న అనంతరం ఈఈ తోట కిరణ్‌కుమార్ స్పందిస్తూ.. దామెర చెరువు అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు. చెరువు పరిస్థితిపై వరంగల్ నిట్ నిపుణులతో అధ్యయనం చేయించామని, వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. మత్స్యశాఖ నుంచి ఈత నిపుణులను పిలిపించి తక్షణ చర్యగా తూముల పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. అలాగే గట్టమ్మనుంచి చెరువుకట్ట వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు శెంకేశి శ్రీనివాస మూర్తి, స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్, స్థానిక రైతులు శెంకేశి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ మూర్తి, సుధాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దామెర చెరువు దుస్థితిని వెలుగులోకి తీసుకువచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



దామెర చెరువు కట్టను పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్‌తో స్థానిక రైతులు

పూజా మందిరాల నిర్మాణమెప్పుడు?

- మేడారంలో ఏడాది గడిచినా గుడి పనులకు కలగని మోక్షం
- టెండర్లు ముగిసి నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని నిర్మాణాలు
- మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలంటున్న పూజారులు




మేడారంలో సమ్మక్క పూజా మందిరం

తాడ్వాయి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఇలవేల్పుల పూజా మందిరాల నిర్మాణానికి నేటికి మోక్షం కలగడం లేదు. భక్తుల కల్పవల్లులుగా పేరొందిన ఆ తల్లుల గుడులు కట్టడంలో ఎందుకు ఇంత జాప్యం చేస్తున్నారని పలువురు పూజారులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మక్క, సారలమ్మ గుడుల శాశ్వత నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం ఇంత వరకూ ప్రారంభం కాకపోవడం శోచనీయం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మల పూజా మందిరాల ఆధునీకరణ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది.

2024 సెప్టెంబరు నెలలో ప్రణాళికలు రూపొందించి శిథిలావస్థలో ఉన్న మేడారం గ్రామంలో ఉన్న సమ్మక్క గుడికి రూ.90లక్షలు, కన్నెపల్లి గ్రామంలో ఉన్న సారలమ్మ గుడికి రూ.90 లక్షల నిధులతో శాశ్వత ప్రాతిపదికన రాతి కట్టడాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుత్తేదారులను పిలిచి టెండర్లు తీసుకున్నారు. ఈ క్రమంలో మినీ జాతర, ఎమ్మెల్సీ ఎన్నికలు అడ్డు రావడంతో పనులు వాయిదా పడ్డాయి. మార్చిలో తిరిగి టెండర్లను అధికారులు విప్పి సదరు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కాగా పనులు నేటికి ప్రారంభానికి నోచుకోకపోవడంతో పూజారుల్లో అసంతృప్తి నెలకొంది. వర్షాకాలం గుడులు కురుస్తున్నాయని పూజారులు అంటున్నారు. వన దేవతల పూజా మందిరాల నిర్మాణ పనులు ప్రారంభమై మహా జాతర వరకు పూర్తవుతాయన్న పూజారుల ఆశలు ఆవిరయ్యేట్లు ఉన్నాయి.

కాంట్రాక్టర్ తీరుపై విమర్శలు..

ఏడాది గడుస్తున్నా మేడారం సమ్మక్క, సారలమ్మల మందిర నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు గుడుల నిర్మాణానికి కాంట్రక్టర్ సముఖంగా ఉన్నాడా...? లేదా అనే చర్చ జరుగుతోంది. మేడారం దేవస్థానం గత కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. అయినప్పటికీ స్పందించక పోవడం గమనార్హం. అధికారులు ఈ టెండర్‌ను రద్దు చేసి మరలా రీ టెండర్ వేస్తారా...? అనే అనుమానాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా పూజారులు కాంట్రాక్టర్‌ను మార్చి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్ కంటే ముందు పనులను అధికారులు కుంటుపడేశారని, పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుందని పూజారులు అంటున్నారు. ప్రణాళికలు రూపొందించిన నాటి నుంచి సమ్మక్క, సారలమ్మ గుడులపై అధికారులు చిన్నచూపుగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. గతంలో మినీ జాతర అడ్డు వస్తే ఈ సారి మహా జాతర అడ్డు వస్తుందా...! అని మాట్లాడుతున్నారు. వెంటనే పనులు చేపట్టాలని పూజారులు కోరుతున్నారు.



ఆర్కిటెక్చర్లు రూపొందించిన మందిరాల డిజైన్



కన్నెపల్లిలో సారలమ్మ పూజా మందిరం

గుడి కురుస్తోంది..

- సిద్ధబోయిన మునీందర్, ప్రధాన పూజారి

వర్షం కురిస్తే సమ్మక్క గుడి కురుస్తోంది పునర్నిర్మాణం జరుగుతుందని ఆశ పడ్డాం. గుడి అభివృద్ధి జరగాలని గట్టి కోరిక ఉంది. దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కార్యనిర్వహణ అధికారి మారి పనులు కుంటుపడ్డాయి. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దృష్టి సారించి గద్దెల అభివృద్ధితో పాటుగా మేడారంలో ఉన్న సమ్మక్క గుడి, కన్నెపల్లిలో ఉన్న సారలమ్మల పూజా మందిరాలను అభివృద్ధి చేయాలి.

విద్యాలయాల్లో ముందస్తు బతుకమ్మ

ములుగు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ముందస్తు వేడుకలు జిల్లా కేంద్రంలో శనివారం పలు విద్యా సంస్థల్లో ఘనంగా జరిగాయి. సోమవారం నుంచి దసరా సెలవులు ఉండటంతో ముందస్తుగా సంబరాలను నిర్వహించారు. మహర్షి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ హాజరయ్యారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ తుమ్మ పిచ్చిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ నరేడ్ల సంజయ్ కుమార్, డైరెక్టర్ వెంకట్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తడుక సుధాకర్, అధ్యాపకులు ఆర్. శాంతకుమార్, ఎస్. కుమార్, కె.నరేష్, రమ్య, అభిలాష్, వంశీ, కాంగ్రెస్ నాయకులు జక్కుల రేవంత్, అభి, వంశీ పాల్గొన్నారు.



భూపాలపల్లి సింగరేణి స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు



ములుగులో బతుమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న రవిచందర్

● కృష్ణకాలనీ, (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి పాఠశాలలో బతుకమ్మ ముందస్తు సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. నార్లాపూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, సరిత, జ్యోతి, నర్సిహ, వెంకటేశ్వర్లు, భుజంగరావు, విజయ్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి, నైన్‌పాక కాంప్లెక్స్ హెచ్ఎం ఊర్మిళరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశా లల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్టీ గురుకులంలో బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాజేందర్, నాగలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, సరిత, అధ్యాపకులు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థినులు ముందస్తు బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్, రంగరాజపురం పాఠశాల, విజన్ పబ్లిక్‌స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జీవీవీ.సత్యనారాయణ, ఉపాధ్యాయులు బొల్లె శ్రీనివాసరావు, జయరాం, మహిళా ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శారద విద్యాలయంలో బతుకమ్మ వేడుక

పరకాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరకాల పట్టణంలోని శారద విద్యాలయంలో శనివారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులు, ఉపాధ్యాయునీలు రంగు రంగుల దుస్తులు ధరించి తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మార్క సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద పండగ బతుకమ్మ అని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు రూపం ఈ బతు కమ్మ పూలనే దేవతగా పూజించే పండగ ఇది. తెలంగాణ జాతికి ఆత్మగౌరవం బతుకమ్మ పండుగ అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శారద విద్యాలయంలో బతుకమ్మ వేడుక

సీఎం, ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 5 ఇన్‌క్లైన్ కమాన్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద బీఆర్ఎస్‌వీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షు రాలు గండ్ర జ్యోతిపై టేకుమట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిన ఆరోపణలను ఖండిస్తూ నిరసనకు దిగారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు బీబీచారి, కరాటే శ్రీనివాస్, కృష్ణమూర్తి, బీఆర్ఎస్‌వీ నాయకులు పోలవేని మహేందర్ యాదవ్, కొల్లోజు దిలీప్ కుమార్, సామల హరీశ్, ఆకుదారి మనోహర్, భాస్కర్ నాయక్, కొమ్ము దేవేందర్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి : బీఆర్ఎస్

చిట్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనేఇసుక అక్రమ రవాణా జరుగుతోందని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన ప్రభుత్వం, అధికారులు టేకుమట్ల బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతిపై కాంగ్రెస్ టేకుమట్ల మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ చేసిన అనుచిత వాఖ్యలను ఖండించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కాట్రేవుల కుమార్, మండల ప్రధానకార్యదర్శి మడికొండ రవీం దర్‌రావు, ఏరుకొండ రాజేందర్, నాయకులు రమణాచారి, భైరం భద్రయ్య, ఎలేటి రాజు, కృష్ణ, రఘు, సురేష్, రాజు, నాగరాజు, శ్రీశైలం, చందు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మహదేవపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన మంగయ్ నాగేశ్వరి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ తెలిపారు. నాగేశ్వరి కాటారం కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లో జరిగే పోటీల్లో ఆమె పాల్గొననుంది.



నాగేశ్వరి


నిబంధనలు పాటించాలి

టేకుమట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు లోబడి ఇసుక రవాణా చేయాలని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్సై దాసరి సుధాకర్ అన్నారు. ఇసుక రవాణాకు సంబంధించిన విధి విధానాలపై అన్ని శాఖల అధికారులతో శనివారం తహసీల్దార్ సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ఇసుకను అనుమతితో తర లించాలన్నారు. ఇకపై ఇసుక రవాణాకు సంబంధించి గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అనిత, ఆర్ఐ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ విజయ్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

రేగొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పరకాల-భూపాలపల్లి రహదారిపై బీఆర్ఎస్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ పాపిరెడ్డి, నాయకులు మాదాడి కర్ణాకర్‌రెడ్డి, గంపల లింగన్న, భిక్యానాయక్, కానుంగటి శ్రీనివాస్, రఘసాల తిరుపతి, ఎడ్ల అనూష్‌రెడ్డి, ముద్దమల్ల సమ్మయ్య, దాట్ల రాజేందర్, తాల్లపల్లి చింటూగౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ ధర్నా



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు, వృద్ధులు

మహదేవపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బెల్లంపల్లి సురేష్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లను పెంచాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వీరగంటి సమ్మయ్య వికలాంగుల సంఘం మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షుడు వీరంగంటి సమ్మయ్య, ముస్తాక్, అంజలి, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయాల ముట్టడి

కాటారం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వ ర్యంలో వికలాంగుల పెన్షన్‌దారులు శనివారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేపట్టారు. దివ్యాంగులు సహా వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళల పెన్షన్ డబ్బులను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ముట్టడికి పిలుపునిచ్చింది. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి ఆధ్వర్యంలో పెన్షనర్లు జీపీ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టి కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్ర మంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య, మండల నాయకులు దేవరాజు, శ్రీనివాస్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

చిట్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల్లో చదువుతున్న పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, ఖాన్ అకాడమీ సహకారంతో ఎప్‌సెట్, జేఈఈ మెయిన్స్, నీట్, క్లాట్‌పై ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వనభోజనాలకు ఇప్పలపల్లి వాసులు

కాటారం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాదరావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పలపల్లి గ్రామస్థులంతా శనివారం వనభోజనాలకు తరలివెళ్లారు. దసరా పండుగకు ముందు వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీ అని తెలిపారు. కుటుంబ సమేతంగా సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి ఆటపాటలు, విందు వినోదాలతో సందడి చేశారు. మహిళలు బతుకమ్మ అడి అక్కడే ఉన్న వాగులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజయ్య, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

పూల జాతరకు వేళాయే..

(5వ పేజీ తరువాయి)

రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా ఇంటి ముఖం పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. దీంతో బస్టాండ్లు కిటకిటలాడాయి. బస్సులన్నీ కిక్కిరిసి కనిపించాయి.

ముఖ్యమైన స్థలాలు ఇవే..

జిల్లా కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద మహిళలు బతుకమ్మ ఆడతారు. అలాగే విశాలమైన ఆట స్థలం ఉన్న ఒకచోటికి చేరి ఆటపాటలో మునిగిపోతారు. ముఖ్యంగా భూపాలపల్లి పట్టణంలో ప్రధానంగా కృష్ణకాలనీలోని అంబేద్కర్ క్రీడా మైదానం, హనుమాన్ దేవాలయం సమీపంలోని స్థలం, బతుకమ్మ విగ్రహం వద్ద, సుభాష్‌కాలనీలోని మినీ స్టేడియం, మిలీనియం క్వార్టర్స్‌లోని కాకతీయ క్రీడా మైదానం, కాశీంపల్లిలో ప్రధాన కూడళ్ల వద్ద, పుల్లూరిరామయ్యపల్లిలో హనుమాన్ దేవాలయం వద్ద, సెగ్గం పల్లి, జంగేడులో ప్రభుత్వం పాఠశాలల ఆవరణ, వేశాలపల్లిలో ప్రధాన కూడళ్ల వద్ద, హనుమాన్ దేవాలయం వద్ద బతుకమ్మ ఆడతారు. అంతేకాకుండా ప్రతి కాలనీలోనూ బతుకమ్మ ఆడటం విశేషం.

'అక్రమ అరెస్టులు సరికావు'

గణపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): టేకుమట్ల మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తే పోలీసులు అరెస్టు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. టేకుమట్లలో బీఆర్ఎస్ నాయకుల అరెస్టుకు నిరసనగా గణపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనరసింహరావు, పూర్ణచందర్‌రెడ్డి, కుమారస్వామి, కన్నయ్య, రవీందర్, గాజర్ల చింటూ, రామకృష్ణ, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకులే అక్రమ ఇసుక రవాణా దొంగలని మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొడారి రమేష్‌లు అన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతిలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, టేకుమట్ల మండల బీఆర్ఎస్ నాయకుల అరెస్టును నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, రాములు, గూడెపు శ్రీనివాస్, గాలి చంద్రమౌళి, బద్దం జయపాల్‌రెడ్డి, గడ్డం రాజు, ముడుపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పస్రా సీఐని కలిసిన మున్నూరుకాపు సంఘం నాయకులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పస్రా సీఐగా విధుల్లో చేరిన దయాకర్‌ను శనివారం మున్నూరుకాపు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ఆయనకకు పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు అల్లూరి నాగేశ్వర్‌రావు, నాయకులు జీవంజి కృష్ణమూర్తి,చామర్తి సాంబ శివరావు, మహేందర్, కృష్ణ, మిర్యాల వెంకన్న, ఏనె శ్రీను పాల్గొన్నారు.

నార్లాపూర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

తాడ్వాయి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నార్లాపూర్ గ్రామంలోని రైతు వేదికలో కొడిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. 322 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 280 మంది మహిళలు, 42 మంది ఉన్నారు. పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ సేవలు కూడా అందించామని వైద్య సిబ్బంది తెలిపారు.


ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్ ప్రవీణ్, కాల్వపల్లి, నార్లాపూర్ పల్లె దవాఖాన వైద్యులు విజయ్, ఆలెం శ్రావణి, వైద్యసిబ్బంది పద్మ, మంజూల, లక్ష్మి, సీతారాం, ఆశా కార్యకర్తలు రాధ, రాణి, రజిత, భాగ్య, పార్వతి, నాగమణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే

వెంకటాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకొండా పురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిరుకూరి సతీష్ తండ్రి వెంకటరామారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శనివారం ఆయన దశదినకర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుడవర్తి నర్సింహమూర్తి, మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు చిడెం రవి, గోరంట్ల రాఘవయ్య, నల్లూరి సుధాకర్, పూజారి సమ్మయ్య, ముడుంబ శ్రీను, కొర్సా శ్రీనివాసరావు, మురళి, రాజేష్, తదితరులు ఉన్నారు.



వెంకటరామారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల సంతాపం

చిరుకూరి వెంకటరామారావు మృతిపట్ల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబసభ్యులను సొసైటీ చైర్మన్‌గా, రాష్ట్ర నాయకుడు చిడెం మోహన్‌రావు, వెంకటాపురం మాజీ సొసైటీ చైర్మన్ గూడపాటి శ్రీనివాసరావు, చర్ల కాంగ్రెస్ నాయకులు లంక రాజు, ఇర్పవసంత్‌లు పరామర్శించారు.

రామారావు మృతి తీరనిలోటు : బీఆర్ఎస్

చిరుకూరి వెంకటరామారావు మృతి తీరనిదని స్థానిక బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆయన దశదినకర్మకు హాజరైన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గూడవర్తి నర్సింహమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి

ఫారెస్టు రేంజర్‌ను కోరిన ఆదివాసీ నేతలు

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొడ్ల గ్రామ సమీపంలో ఉన్న ఎనిమిదెకరాల భూమిలో ఇళ్ల నిర్మాణాలకు అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు కోరారు. ఈ మేరకు మండలంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఫారెస్టు దక్షిణ విభాగం రేంజర్ అబ్దుల్ రహ్మాన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు దుబ్బ ప్రవీణ్ మాట్లాడుతూ 1986లో జంపన్నవాగు వరదలకు గ్రామంలోని ఇండ్లన్నీ కొట్టుకుపోగా గ్రామస్తులందరం కలిసి దొడ్ల గ్రామానికి కొంత దూరం వచ్చి జీవనం సాగిస్తున్నామన్నారు. 2023లో వచ్చిన వరదకు ఊరు కూడా మునిగిపోయిందని, దీంతో వేరే ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి ఎనిమిదెకరాల భూమిని చదును చేసుకున్నామని తెలిపారు. కానీ ఆ భూమిలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టకుండా అటవీశాఖ అడ్డుపడుతోందన్నారు. గ్రామస్థుల సౌకర్యార్థం ఇళ్ల నిర్మాణానికి మాత్రమే భూమిని చదును చేసినట్టు తెలిపారు. అంతేగానీ సాగుకు కాదని స్పష్టం చేశారు. ఆ భూమిలో గ్రామస్థులకు ఇళ్ల స్థలాలకు ఇవ్వాలని ఆయన తెలిపారు.

స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలి : ఎమ్మార్పీఎస్

ములుగు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జేడీ మల్లంపల్లి మండలం పందికుంట క్రాస్ నుంచి భూపాల్‌నగర్ గ్రామం వరకు స్ట్రీట్ లైట్స్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం భద్రయ్య కోరారు. ఈ మేరకు డీపీవో దేవరాజ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. స్ట్రీట్ లైట్స్ లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణం చేసే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, అడవి పందుల బారిన పడుతున్నారని తెలిపారు. వలన వరుసగా ప్రమాదాలకు పందికుంట క్రాస్ వద్ద ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా మెయిన్ జంక్షన్ స్ట్రీట్ లైట్ ఏర్పాటు చేయాలని కోరారు.

పీహెచ్‌సీలో వైద్య శిబిరం

మంగపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన చంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 300 మంది పిల్లలకు రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం చిన్న పిల్లలకు వచ్చే సీజనల్ వ్యాధులు, న్యూట్రిషియన్ పరంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు యమున, పద్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్‌లో రాణించిన విద్యార్థినికి సన్మానం



నవ్యజ్ఞాపికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వాజేడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో 2021-22లో పదోతరగతి విద్యనభ్యసించిన తల్లడి నవ్యజ్ఞాపిక నీట్ ఎగ్జామ్‌లో ఉత్తమ మార్కులు సాధించి మెడికల్ సీటను సంపాదించుకుంది. దీంతో ఆమెను ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. నిరుపేద ఆదివాసీతెగకు చెందిన నవ్యజ్ఞాపిక ఉన్నత చదువులు చదివి రాణించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇర్ప కేశవరావు, సిబ్బంది పూనెం రోజారాణి, పాయం తిరుపతమ్మ, పెండెకట్ల బుచ్చిబాబు, కృష్ణయ్య, రామారావు, భారతి, ఉమాదేవి, రాంబాబులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చూచిరాత కాపీల అందజేత

గోవిందరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థులు సూరపనేని కుషాల్‌కుమార్, పోలెపల్లి రమేష్, మిట్టకంటి శ్రీనివాస్, దామల్ల సాంబయ్య, కవితలు రూ.10వేల విలువచేసే తెలుగు, ఇంగ్లిష్ చూచిరాత కాపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం బి.శ్యాం సుందర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మయ్య, ఉపాధ్యాయులు ఆర్.వాసుదేవరెడ్డి,మాధవిలత, సంజీవరాణి, పావని పాల్గొన్నారు.

ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్‌కు సన్మానం

వెంకటాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉల్లాస్ ములుగు జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపికైన మండలంలోని సుడిబాక పాఠశాల హెచ్ఎం వీర్ల కృష్ణబాబును శనివారం పాఠశాల ఆవరణలో లక్ష్మీనగరం కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమౌళి, బొగ్గుల లక్ష్మయ్య, గోవర్ధన్, బుచ్చయ్య, బాబూరావు, నర్సింహచారి, సమ్మయ్య, కుమారస్వామి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు సమకూర్చాలని కార్యదర్శుల వినతి

మంగపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలని పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు అందకపోవడంతో పంచాయతీల నిర్వహణ పెనుభారంగా మారిందని అన్నారు.

నేర నియంత్రణకు ప్రజలు సహకరించాలి

మంగపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతి భద్రతలు, నేర నియంత్రణకు ప్రజలు సహకరించాలని ఎస్సై తిరునగరి వెంకటరంగ సూరి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, జూదం, కోడి పందాలు తదితర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు భాగస్వాములు కావాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ ఎస్సైలు శ్రీకాంత్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం పనులకు టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలి

(5వ పేజీ తరువాయి)

సమీక్ష సమావేశం నిర్వహించారు. పూజారుల కోరిక మేరకు ఆలయ విస్తరణ పనులను చేపడతామన్నారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలను యథా తథంగా ఉంచి ఆదివాసీల సంప్రదా యాలను తప్పకుండా గౌరవిస్తామన్నా రు. గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా స్వాగత తోరణం డిజైన్లను రూపొందిం చాలని అన్నారు. ఆలయ పరిసర ప్రాం తాల్లో ఆ ప్రాంత సంప్రదాయ వృక్షాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదురు వేం నరేందర్, ఎంపీ బలరాంనాయక్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.